

వేతన వేతలు..

ఇల్లంతకుంటలో ఉపాధిహామీ పనుల్లో కూలీలు

- నాలుగు నెలలుగా 'ఉపాధి' సిబ్బంది ఎదురుచూపులు
- ఇబ్బందుల్లో 248 మంది సిబ్బంది..

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సిబ్బంది చాలీచాలనీ వేతనాలు, అధిక పని భారంతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ పేద కూలీలకు జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా ఉపాధికల్పన, సుస్థిర ఆస్తుల కల్పన, గ్రామీణ పేదల జీవనోపాధి వనరులను శక్తివంతం చేసే కార్యక్రమాల్లో కీలకంగా పనిచేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో గ్రామీణ ఉపాధిహామీ పథకం అధికారులు, క్షేత్రస్థాయిలో పనిచేసే ఫీల్డ్‌అసిస్టెంట్లకు 3నుంచి నాలుగునెలల వేతనాలు అందక తీవ్ర ఇబ్బందుల మధ్య బతుకు బండి లాగుతున్నారు. ఉపాధిహామీ పనుల ప్రదేశాల వద్ద పారదర్శకంగా నిరంతరం పర్యవేక్షణ చేసే ఫీల్డ్‌అసిస్టెంట్ల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. నాలుగు నెలలుగా వేతనాలు అందక అప్పులుచేస్తూ కుటుంబాల పోషణను సాగిస్తున్నారు.

- 18 ఏళ్లుగా భారంగానే...

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో కూలీల వలసలను నివారిస్తూ ఉపాధిహామీ పథకం కింద చేపట్టే పనులను పర్యవేక్షిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది దాదాపు 18 ఏండ్లుగా పని చేస్తున్నా ఏలాంటి ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు లేక.. సకాలంలో వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖలో 248 మంది పనిచేస్తున్నారు. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్లు 153 మంది ఉన్నారు. వేతనాలకోసం ఎదురుచూస్తున్న వారిలో డీఆర్‌డీవో ఆఫీస్‌లో 19మంది, బోయినపల్లిలో 21మంది, చందుర్తిలో 21మంది, ఇల్లంతకుంట 31మంది, గంభీరావుపేటలో 19మంది, కోనరావుపేట 27మంది, ముస్తాబాద్‌లో 21మంది, రుద్రంగిలో ఆరుగురు, తంగళ్లపల్లిలో 29మంది, వీర్నపల్లిలో 10మంది, వేములవాడలో ఐదుగురు, వేములవాడ రూరల్‌లో 17మంది, ఎల్లారెడ్డిపేటలో 22మంది పనిచేస్తున్నారు. నిత్యం క్షేత్రస్థాయిలో తిరుగుతూ పనులు పర్యవేక్షిస్తున్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు ఉదయం నుంచి సాయంత్రంవరకు గ్రామాల్లో కూలీలను మానిటరింగ్ చేస్తూ వారికి కేటాయించిన పనులను చేయిస్తున్నారు. దాదాపు 24పనులు పర్యవేక్షిస్తారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం ఏ కేటగిరీ కింద రూ.13 వేలు, బీ కేటగిరీ కింద రూ 9500, సీ కేటగిరీ కింద రూ.8వేలు చెల్లిస్తున్నారు. పని విధానాలను బట్టి ఫీల్డ్‌అసిస్టెంట్లను విభజించి వేతనాలు ఇస్తున్నారు. ఈ జీవో 4779ను రద్దు చేసి గౌరవ వేతనం ఇవ్వాలని, హెల్త్‌కార్డులు, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం మాత్రం పట్టించుకోకపోగా సకాలంలో వేతనాలు అందించడం లేదు.



తంగళ్లపల్లిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు (ఫైల్)

ఇటీవల ఫీల్డ్‌అసిస్టెంట్లు ప్రభుత్వాన్ని కోరుతూ వినతి పత్రాలు అందించారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు రూ10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కనీస వేతనంగా రూ 35 వే లు, పేస్కేల్ వర్తింపజేయాలని వినతిపత్రాలు అందించారు. గత ప్రభుత్వంలో పనిచేసి కోల్పోయిన 31 నెలల జీతాలను ఇవ్వాలని కోరారు.

- జిల్లాలో 1,99,660 మంది ఉపాధి కూలీలు...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 98,123 జాబ్ కార్డులు జారీ చేయగా, వీటిపరిధిలో 1,99,660 మంది కూలీలు ఉన్నారు. మహిళలు 1,01,252 మంది ఉన్నారు. ఎస్సీలు 52,744, ఎస్టీలు 15,399, ఇతరులు 1,31,517 మంది ఉన్నారు. జిల్లాలో ఉపాధి పొందుతున్న వారిలో 64,649 జాబ్ కార్డుల్లో 91,590 మంది ఉన్నారు. వీరిలో మహిళలు 55,594 మంది ఉన్నారు. ఎస్సీలు 23,476 మంది, ఎస్టీలు 9,445 మంది, ఉపాధి పొందుతున్నారు. ఉపాధిహామీ కూలీలకు ఈ ఆర్థిక సంవత్సరం 7 రూపాయలను పెంచింది. ప్రస్తుతం రూ 300 ఉన్న కూలీ రూ 307కు పెరగడంతో సమ్మర్ అలవెన్స్‌లు మూడేండ్లుగా దూరమైన క్రమంలో కూలీ పెరుగుదల ఉపశమనం కలిగించింది. జిల్లాలో ఉపాధిహామీ పథకంలో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి కూలీలకు పనిదినాలు కల్పించడానికి రూ.80.26 కోట్ల అంచనా బడ్జెట్‌తో 26.75 లక్షల పనిదినాలు లక్ష్యంగా పెట్టుకొని పనులను చేపట్టారు. మండల స్థాయిలో వ్యవసాయ సంబంధింత పనులకు ప్రాధాన్యత ఇచ్చారు. లేబర్ బడ్జెట్ పనిదినాల్లో బోయినపల్లి మండలంలో 1,40,710 పనిదినాలు లక్ష్యంగా పెట్టుకోగా చందుర్తిలో 2,44,424, ఇల్లంతకుంటలో 2,63,735, గంభీరావుపేటలో 3,66,733, కోనరావుపేటలో 3,02,552, ముస్తాబాద్‌లో 2,51,286, రుద్రంగిలో 69,347, తంగళ్లపల్లిలో 3,34,000, వీర్నపల్లిలో 2,35,000, వేములవాడలో 45,200, వేములవాడ రూరల్‌లో 1,46,730, ఎల్లారెడ్డిపేటలో 2,75,666 పనిది నాలను లక్ష్యంగా పెట్టుకున్నారు. పనిదినాలను 2025 సంవత్సరంలో ఏప్రిల్ మాసంలో 4,36,477 పనిదినాలు కల్పించాలని నిర్ణయించారు. మే నెల వరకు 8,65,202 పని దినాలు, జూన్‌వరకు 11,19,603 పనిదినాలు, జూలై వరకు 12,31,258 పనిదినాలు,

మిగతా 4లో

పచ్చదనానికి 'గొడ్డలి'పెట్టు..

- యథేచ్ఛగా హరితహారం చెట్ల నరికివేత
- రహదారి వెంట వృక్షాలకు రక్షణ కరువు

2



మూడపల్లి శివారులో నరికివేసిన చెట్లు

రోడ్లపై వారసంతలు.. రాకపోకలకు ఇబ్బందులు..

- తరచుగా ప్రమాదాలు
- పెరుగుతున్న దొంగతనాలు
- భయాందోళనలో ప్రజలు



రాచర్లగొల్లపల్లిలో ప్రధాన రహదారిపై వార సంత..

4

బ్యాంక్ అభివృద్ధికి ఖాతాదారులు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి రామకృష్ణ

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ అభివృద్ధికి ఖాతాదారులు సహకరించాలని జిల్లా సహకార అధికారి టి రామకృష్ణ అన్నారు. శనివారం సిరిసిల్ల అర్బన్ బ్యాంక్‌లో అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025 వేడుకల్లో భాగంగా ఖాతాదారుల సేవా సమావేశం చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగింది. ముందుగా అర్బన్ బ్యాంక్ సిరిసిల్ల శాఖ ముఖ్య కార్య నిర్వహణాధికారి పత్తిపాక శ్రీనివాస్ సంక్షిప్త నివేదికను సమర్పించారు. 2025 మార్చి 31 వరకు బ్యాంక్ మొత్తం డిపాజిట్లు రూ. 104కోట్లు, బ్యాంక్ నుండి మంజూరు చేసిన అప్పులు మొత్తం రూ. 79కోట్లు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి జిల్లా సహకార అధికారి రామకృష్ణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సహకార వ్యవస్థను అభివృద్ధి చేస్తోందన్నారు. సహకార బ్యాంకులను స్థానికులు ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో బ్యాంక్ డైరెక్టర్లు గుడ్ల సత్యానందం, చొప్పదండి ప్రమోద్, వేముల సుక్కమ్మ, ఎనగందుల శంకర్, వలుస హరిణి, కోడం సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం కార్మికుల నిరసన



అధికారుల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో సిరిసిల్ల మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలోని (నీటి సరఫరా) కార్మికులు వేతనాల కోసం మున్సిపల్ కార్యాలయం కమీషనర్, ఇంజనీరింగ్ అధికారుల ఛాంబర్ ఎదుట నిరసనలు తెలిపారు. రెండు నెలలుగా వేతనాలు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని కుటుంబ పోషణ భారంగా మారుతోందని మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కార్మికులు మొరపెట్టుకున్నారు. బుధవారంలోపు వేతనాలు వస్తాయని అధికారులు కార్మికులకు సర్దిచెప్పడంతో నిరసన విరమించారు.

ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి : డీఆర్‌డీవో

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని డీఆర్డీవో శేషాద్రి సూచించారు. మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలోని గోదాంను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం నిలువ ఉండకూడదన్నారు. వాతావరణంలో మార్పులు వస్తున్నందున జాగ్రత్తలు తీసుకోవాలని, లారీల్లోకి ధాన్యాన్ని లోడింగ్, అన్‌లోడింగ్ త్వరగా జరిగేలా చూడాలన్నారు. ఇన్‌చార్జ్ డీపీఎం శ్రీనివాస్, ఏపీఎం వాణిశ్రీ పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ ఇంటర్, పదో తరగతి పరీక్షలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆదివారం నుంచి ఓపెన్ ఇంటర్, పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం నుంచి ప్రతిరోజు రెండుపూటలు పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు మధ్యాహ్నం 12 గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పదో తరగతి పరీక్షల కోసం సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియేట్ పరీక్షల కోసం పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్యజిల్లా పరిషత్ బాలుర పాఠశాల, వేములవాడ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే ఏర్పాట్లు చేశారు. జిల్లాలో పదో తరగతి పరీక్షలు రాసేందుకు 298 మంది విద్యార్థులు ఉండగా, ఇంటర్మీడియేట్ పరీక్షలు రాసేందుకు 856 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాన్నున్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే వారందరు ఖచ్చితంగా హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం గుర్తింపు కార్డులను తీసుకుని పరీక్షల కేంద్రాలకు హాజరుకావాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు కోరారు.

తై బాజార్‌కు వేలం..

గంభీరావుపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తై బజార్‌కు శనివారం వేలం పాటలు నిర్వహించారు. తై బజార్‌తో పాటు పాత గ్రామ పంచాయతీ వద్ద ఉన్న కాంప్లెక్స్ గదులకు వేలంపాటల కోసం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తై బజార్‌ను రాఘవేందర్ రావు రూ.3 లక్షల 20 వేలకు వేలం పాటల్లో దక్కించుకున్నారు. పాత గ్రామ పంచాయతీ వద్ద ఉన్న కాంప్లెక్స్ గదులకు వేలం పాటల కోసం డిపాజిట్లు రాకపోవడంతో వాయిదా వేశారు. పాత గ్రామపంచాయతీ వద్ద ఉన్న కాంప్లెక్స్ గదుల వేలంపాటలను తిరిగి నిర్ణయించేందకు త్వరలో తేదీని ఖరారు చేస్తామని ఈవో లక్ష్మణ్ తెలిపారు.

అబద్ధాల పునాదులపైన బీఆర్‌ఎస్ పుట్టింది

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : అబద్ధాల పునాదులపైన టీఆర్ఎస్ పార్టీ పుట్టిందని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం శివనగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడారు. మోసపూరిత మాటలను ప్రజలు నమ్మి బీఆర్ఎస్‌ను అధికారంలోకి రెండు పర్యాయాలు తీసుకొచ్చి పట్టంగడితే ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. కంచె గచ్చిబౌలి, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గురించి కేటీఆర్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వన్య ప్రాణులు, పర్యావరణంపైగానీ అవగాహన ఉంటే జీవో 111ను ఎందుకు ఎత్తివేశారని మీ నాన్నను ఎందుకు ప్రశ్నించలేదని కేటీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న తరుణంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవిత శాపనార్థాలు పెడుతున్నారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కాసర్ల రాజు, వెంకటేశం, నక్క నర్సయ్య, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు కుడికాల రవికుమార్, రాగుల జగన్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్, డైరెక్టర్ నేరెళ్ళ శ్రీకాంత్ గౌడ్, నాయకులు వైద్య శివప్రసాద్, కమలాకర్‌రావు, చందన పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ కోరారు. పార్టీ చేపట్టిన చలో బస్తీలో భాగంగా శనివారం సిరిసిల్ల పట్టణంలోని 24,29, 30,31,32,17,18,19 వార్డుల్లో నాయకులు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించడంతో పాటు కరపత్రాలను అందజేశారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నే హరీష, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు వేముల వైశాలి, నాయకులు సుంకోజు రమేష్ చారీ, పంపరి అర్జున్, రావుల శరత్, చేపూరి అశోక్, అన్నల్‌దాస్ వేణు, గుడ్ల విష్ణు, కోడం రవి, తాటిపాముల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్లలో పనిచేయడం ఆనందంగా ఉంది

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత



జిల్లా ప్రధాన న్యాయమూర్తిని ఘనంగా సత్కరిస్తున్న న్యాయవాదులు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో పనిచేయడం ఆనందంగా ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత అన్నారు. శనివారం సిరిసిల్ల జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిరిసిల్ల నుంచి గద్వాలకు బదిలీపై వెలుతున్న సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలతకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయవాదులు బాధ్యతగా పనిచేసినపుడే గుర్తింపు లభిస్తుందన్నారు. ఇక్కడి న్యాయవాదులు వినమ్రతతో కూడుకున్న వ్యక్తులనీ, ధైర్యవంతులు, తెలివితేటలు గలవారన్నారు. సిరిసిల్ల టౌన్ నుంచి జిల్లా కోర్టు వేరొక చోటకు తరలించేందుకు ప్రయత్నాలు చేస్తే వెంటనే సీనియర్ న్యాయవాదులు హైకోర్టు వరకు వెళ్లి ఎక్కడికి తరలించకుండా చేశారన్నారు. వాస్తవానికి జిల్లా కోర్టు ప్రస్తుతం ఉన్న చోటే ఉంటే అందరికి ఆమోదయోగ్యంగా ఉంటుందన్నా రు. వచ్చే రెండు సంవత్సరాల్లో అనేక కార్యక్రమాలు ఉన్నాయన్నారు. నూతన కోర్టు భవనాలతో పాటు న్యాయమూర్తులకు సైతం ఇక్కడే గృహసముదాయాలు ఏర్పాటు చేయడం వల్ల అధికారులకు పని సులభమవుతుందన్నారు. తొలి పోస్టింగ్‌లోనే సిరిసిల్లలో మూడేళ్లు పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలతను అగ్గిపెట్టెలో ఇమిడే పట్టుచీర అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సృజన, రెండవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి గడ్డం మేఘన, సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, గుండ రవి, ప్రధాన కార్యదర్శులు వెంకటి, సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు సజ్జనం అనిల్‌కుమార్, మహిళా ప్రతినిధి పుష్పలత, లైబ్రరీ కార్యదర్శి శరత్‌రెడ్డి, క్యాషియర్ వేముల నరేశ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

యాసంగి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

- పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి - సన్న బియ్యం సరఫరా, ధాన్యం కొనుగోలుపై వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఇల్లంతకుంట/సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంట కొనుగోలు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సన్న బియ్యం సరఫరా, ధాన్యం కొనుగోలుపై పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, సిరిసిల్ల ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయితో కలిసి ఇల్లంతకుంట తహసీల్దార్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. దేశంలో అత్యధికంగా వరి పంట పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందని, వానాకాలంలో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, యాసంగిలో 127.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పంట పండిందన్నారు. వానాకాలం పంట కొనుగోలు సజావుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించినందుకు కలెక్టర్లు, అదనపు కలెక్టర్‌లు, పౌర సరఫరాల అధికారులు, సిబ్బందికి మంత్రి అభినందనలు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి అదనపుకలెక్టర్ ఖీమ్యా నాయక్ జిల్లా నీటి పారుదల శాఖ అధికారి అమరేందర్ రెడ్డి, అధికారులు కిషోర్, మిషన్ భగీరథ అధికారులు జానకి, శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మి, డీఎం రజిత తదితరులు పాల్గొన్నారు

మిడ్ మానేరులో 35 కిలోల చేప పట్టివేత



చేపను ప్రదర్శిస్తున్న నరేశ్

తంగళ్లపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : తంగళ్ళపల్లి మండలం చీర్లవంచ శివారులో మధ్య మానేరు ప్రాజెక్టులో జాలరుకు 35 కిలోల చేప చిక్కింది. తంగళ్ళపల్లికి చెందిన నరేష్ అనే జాలరి శనివారం మధ్య మానేరులో చేపలు పడుతుండగా వలకు 35 కిలోల కట్ల(బొచ్చ) చేప చిక్కడంతో ఆనందం వ్యక్తం చేశాడు. సోషల్ మీడియాలో అతిపెద్ద చేప ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మధ్య మానేరు ఉపాధికి ఊతం ఇస్తోందని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 31, 32, 33 వార్డుల్లో శనివారం సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు జరగాయి. ముఖ్యఅతిథి కాంగ్రెస్‌పార్టీ సిరిసిల్ల నియోజవకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, రోజా మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుబాల వెంకటేశం, నక్క నర్సయ్య, మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం సిరిసిల్ల పట్టణంలోని షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్స్, కల్యాణ మండపాల్లో సిరిసిల్ల స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎన్. నరెందర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని గాంధిచౌక్ నుంచి ఓల్డ్‌బస్టాండ్ వరకు ఆదివారం ఉదయం8గంటలకు ర్యాలీ నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

జేఈఈ ఫలితాల్లో 'అల్ఫోర్స్'కు ర్యాంకుల పంట



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఐఐటీ జేఈఈ(మెయిన్స్) 2025 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ కేటగిరీల్లో జాతీయస్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం కరీంనగర్ లోని అల్ఫోర్స్ కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్.శరణ్య 49వ ర్యాంకుతో అత్యుత్తమ స్థానంలో నిలువగా, పి శ్రీహర్ష 244 ర్యాంకు, ఎన్ అనిరుద్‌సాయి 272, డి విశాల్ 329, జె వామిక 350, టి ప్రణతి 456, ఇ అంకిత్‌సాయి 574, బి ఆదిత్య 630, టి షివాత్మిక 646, వి హృషికేష్ 703, మహ్మద్ అబ్దుల్ 968, పవార్బాల్, ఆర్ సుమిత్‌కుమార్, డి కార్తీక్‌రెడ్డి, మహ్మద్బుల్షన్, బి విష్ణు ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిని ఇనుమడింపచేశారన్నారు. రానున్న అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించిన విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందంతో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఐఐటీ, నీట్‌లో అల్ఫోర్స్ విద్యార్థులు రాణించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ఘనవిజయం సాధించినందుకు అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు జాతీయ స్థాయిలో ప్రభంజనం సృష్టించాయని చైర్మన్ రమేశ్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులను సాధించారన్నారు. ఎం రోహిత్ 17, టి కుందన్ 814, పి ఈశ్వర్‌ముఖేష్, ఎం అంజలి 2575, బి.అక్షర 2992, ఎం.తరుణ్ 5949, జి.నందిని 7464 ర్యాంకుతోపాటు 20వేల లోపు 15 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. జేఈఈ మెయిన్స్‌కు హాజరైనవారిలో 40 శాతం మంది విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించినట్లు చెప్పారు. అనునిత్యం పర్యవేక్షణ, విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నిండంతో ఇంతటి ఘనవిజయం సాధించామన్నారు. సంస్థ స్థాపించిన నాటి నుంచి అన్ని పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు రాణిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్‌మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌లు మల్లారెడ్డి, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విజయకేతనం చూపిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ రమేశ్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు

ట్రినిటి కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటి విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎ రఘుపతి అనే విద్యార్థి జాతీయస్థాయిలో 138వ ర్యాంకు, ఎ హేమంత్ 132, డి సాయిసరణ్‌కుమార్ 313, ఎస్ పరమేశ్వర్‌రెడ్డి 344, ఎ ఫనీందర్ 409, ఆర్ సాయికిషోర్ 587, వి అదీప్ 751, డి మహేశ్ 974, ఆర్ మనోజ్ 1262, బి సిద్ధిక 1551 ర్యాంకు సాధించారు. కేవలం ఒకే బ్రాంచి నుంచి 1000లోపు ఎనిమిది ర్యాంకులతో పాటు పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 83 శాతం మంది విద్యార్థులు జేఈఈ-అడ్వాన్స్ పరీక్షలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి విద్యార్థులు, అధ్యాపకులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో, నిర్దిష్టమైన ప్రణాళిక, ఉన్నతమైన విద్యా బోధనతో ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. అనంతరం చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ర్యాంకులు సాధించడం ట్రినిటి కళాశాలకే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఆయా బ్రాంచీల ప్రిన్సిపాల్‌లు, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మానకొండూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన మడ్డి తిరుపతి (50) అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. తిరుపతి తన దాబా ఇంటిపై మరో మరో రెండు రూములను నిర్మించేందుకు ఇటుకల గోడను నిర్మిస్తున్నారు. ఈ 12న పనులను పరిశీలించేందుకు ఇంటిపైకి వెళ్లాడు. నూతనంగా నిర్మిస్తున్న గోడను పట్టుకోవడంతో గోడకూలీ కిందపడ్డాడు. తీవ్ర గాయాల పాలైన తిరుపతిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య వనజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సబ్సిడీ రుణం ఇప్పిస్తానని మోసం చేసిన పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన అమ్ముల అశోక్‌యాదవ్‌ను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వల్లంపట్ల గ్రామానికి చెందిన పెంటల మల్లయ్య వద్దకు వెళ్లి ఎస్సీ పేరు మీదు ట్రాక్టర్ కొనుగోలు చేస్తే ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ ఇప్పిస్తానని నమ్మించి రూ.50వేలు తీసుకున్నాడు. కొద్దిరోజులకు సబ్సిడీ మంజూరు అయినట్లు నకిలీ ప్రొసీడింగ్ కాపీ అందించాడు. వంతడుపుల గ్రామానికి చెందిన బోయిని పర్శరాంకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం ఇప్పిస్తానని చెప్పి రూ.50వేలు తీసుకొని నకిలీ ప్రొసీడింగ్ కాపీ అందించాడు. పర్శరాం దీనిని తీసుకొని కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అడగగా నకిలీదని తేలింది. దీనితో బాధితులు ఫిర్యాదు చేయగా శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పచ్చదనానికి గొడ్డలిపెట్టు

యథేచ్ఛగా హరితహారం చెట్ల నరికివేత

రహదారి వెంట వృక్షాలకు రక్షణ కరువు

చందుర్తి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా ఏటా వానాకాలంలో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలాలతో పాటు, ఇళ్లు, పొలాలు, చెరువులు గట్లపై ప్రతిష్టాత్మకంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు అట్టహాసంగా చేపడుతున్నారు. అవి పెరిగి పెద్దవి కాగానే విద్యుత్ తీగలకు అడ్డువస్తున్నాయని విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది ఏపుగా పెరిగిన చెట్లను నరికేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చందుర్తి మండలంలోని మూడపల్లి, మర్రిగడ్డ, లింగంపేట, మల్యాల తదితర గ్రామాల్లో పదేళ్లుగా నాటిన మొక్కలు పెరిగి పెద్దవి కాగా విద్యుత్ అధికారులు తీగలకు అడ్డువస్తున్నాయని, రైతులు తమ పంట పొలాలపై చెట్ల నీడతో పంటలు పండవని చెట్లను మొదళ్ల నుంచి నరికేస్తున్నారు. గతంలో రోడ్లకిరువైపులా ఉపాధిహామి, ఆటవీ శాఖ అధికారులు, గ్రామపంచాయతీలను భాగస్వామ్యం చేస్తూ పెద్దఎత్తున మొక్కలను నాటించారు. ఒక్కొక్క గ్రామాల్లో వేలాది మొక్కలు నాటారు. వాటిలో దాదాపు 80 శాతం మేర ఏపుగా పెరిగాయి. ప్రధాన రోడ్లకిరువైపులా ఇప్పటికే పలుమార్లు చెట్లను నరికేశారు. అయినా అవి పెరుగుతుంటే అధికారులు విద్యుత్ తీగలకు అడ్డువచ్చే చెట్ల కొమ్మలతో పాటు ఇతర చెట్లను సైతం నరికేస్తున్నారు. పలుచోట్ల మొదళ్ల వరకు నరికేసి చేతులు దులుపుకుంటున్నారు.



మూడపల్లిలో బైపాస్ రోడ్డులో నరికిన చెట్లు

చెట్లను నరికివేస్తే చర్యలు తీసుకుంటాం..

రాజయ్య, చందుర్తి ఏపీవో



హరితహారంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన మొక్కలను తొలగించినా, చెట్లను నరికివేసినా చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. జరిమానాతోపాటు కేసులు కూడా నమోదు చేయిస్తాం. మొక్కలు, చెట్లను నరికి వేయడం, తగలబెట్టడం లాంటి పనులు చేయవద్దు.



మూడపల్లి శివారులో నరికిన హరితహారం చెట్లు

కన్నెత్తి చూడని అధికారులు

గ్రామపంచాయతీల్లో కొన్ని సంవత్సరాల నుంచి పెంచిన హరితహారం చెట్లను యథేచ్ఛగా నరికేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. చెట్లు తిరిగి చిగురించేందుకు వీలు లేకుండా మొదళ్ల వరుకు నరికేస్తున్నారు. తీగలకు తగిలే కొమ్మలను తొలగించకుండా మొత్తం చెట్లను నరికి వేస్తుస్తుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టించుకోని అటవీ శాఖ అధికారులు పెద్దఎత్తున రోడ్లకిరువైపుల చెట్లు నరికివేతకు గురవుతున్నప్పటికీ ఉపాధిహామీ అధికారులు కానీ, అటు అటవీ శాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. సొంత ప్లాట్లలో పెరిగిన చెట్లను తొలగించడానికి అనుమతుల పేరుతో ఇబ్బందులకు గురిచేసే అధికారులు ఎంతో ప్రజాధనం వెచ్చించి హరితహారంలో భాగంగా పెంచిన చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా నరికేస్తున్నా కనీస చర్యలు చేపట్టడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి చెట్లు నరికివేతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జేఈఈ ఫలితాల్లో 'ఎస్ఆర్' విద్యార్థుల జయకేతనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఆర్ కళాశాలల జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుపతి

తిమ్మాపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో ఎస్ఆర్ కళాశాలకు చెందిన విద్యార్థులు జయకేతనం ఎగుర వేసినట్లు కళాశాలల జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుపతి తెలిపారు. మండలంలోని అలుగునూర్‌లోగల ఎస్ఆర్ కళాశాల ఆవరణలో శనివారం మీడియా సమావేశంలో మాట్లా డారు. జేఈఈ మెయిన్స్‌లో తమ కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు అర్హత సాధిం చారని తెలిపారు. ఎస్ఆర్ కళాశాలకు చెందిన దాదాపు 185 మందికి పైగా విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌లో విజయం సాధించినట్లు తెలిపారు. వై భరణి శంకర్ జాతీయ స్థాయి లో 88వ ర్యాంకు సాధించగా, బి సురేష్ 98వ ర్యాంకు, ఎ కార్తిక్ 584వ ర్యాంకు, లకావత్ మాధవ్‌చరణ్ 707వ ర్యాంకు, లునావత్ రామ్ చరణ్ 777వ ర్యాంకు, పత్తెం హృషికేష్ 796వ ర్యాంకు సాధించారని వివరించారు. వారితో పాటు మరో ఏడుగురు విద్యార్థులు ఆరువేల లోపు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. విద్యాసంస్థల అధినేత వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కరీంనగర్ డీజీఎం వాసుదేవరెడ్డి, జోనల్ ఇన్‌చార్జి నేదురు తిరుప తిరెడ్డి, ప్రిన్సిపాల్స్‌ను అభినందించారు.

జమ్మికుంట సప్తగిరి ఆసుపత్రి పర్మిషన్ రద్దు

- సీజ్ చేస్తున్నట్లు వైద్యశాఖ నోటీసులు

జమ్మికుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని పాత అంబేద్కర్ చౌరస్తాలో గల సప్తగిరి ఆసుపత్రిలో సీఎంఆర్ఎఫ్ బిల్లుల్లో అక్రమాలు జరిగాయని సీఐడీ అధికారులు నిగ్గు తేల్చారు. దీంతో ఆసుపత్రి అనుమతి రద్దు చేసి, సీజ్ చేస్తున్నట్లు వైద్యారోగ్య శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. అయిన కూడా ఆసుపత్రి నడిపిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు శనివారం ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రి షెటర్ ఎందుకు తీసి పెట్టారని నిర్వాహకులను ప్రశ్నించారు. ఇందులో డెంటల్ ఆసుపత్రి ఉందని, మిగితా వైద్యసేవలు మూసి వేశామన్నారు. అంతేకుండా ఇందులో నుంచి ఇంట్లోకి వెళ్లాల్సిన దారి ఉందని డెంటల్ డాక్టర్ రామకృష్ణ వైద్యాధికారులకు తెలిపారు. మెయిన్ షెటర్ దగ్గరుండి మూసి వేయించారు.

● ఎనిమిది నెలల క్రితం సీఐడీ విచారణ

సప్తగిరి ఆసుపత్రిలో సీఎంఆర్ఎఫ్ బిల్లుల అవకతవకలపై సీఐడీ అధికారులు గత ఏడాది సెప్టెంబరు 10వ తేదీన తనిఖీలు చేపట్టారు. రోగులకు చికిత్స చేయకుండా చేసినట్లుగా బిల్లులు సృష్టించిన వ్యవహారంలో వాటికి సంబంధించిన ఆధారాలు సేకరించారు. ఆసుపత్రి డాక్టర్ వంశీని సైతం విచారించారు. తనకు తెలియకుండా ఎవరో బిల్లులు ఇచ్చారని వైద్యుడు వివరణ ఇచ్చాడు. అవకతవకలు జరిగినట్లుగా నిర్ధారించిన సీఐడీ వైద్యారోగ్య శాఖకు నివేదికను అందించింది. ఆ సమయంలోనే సదరు ఆసుపత్రిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. ప్రస్తుతం ఆసుపత్రి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చేపల వేటకు వెళ్లి బాలుడి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలోని కొత్తపల్లి మండలం రేకుర్తి సాలెహ్‌నగర్‌కు చెందిన మహ్మద్ అహీర్ అజ్మాన్(11) అనే బాలుడు చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలోపడి మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసుల వివరాల ప్రకారం... స్థానిక వెంకటేశ్వర కాలనీ శ్మశానవాటిక సమీపంలో ఉన్న ఒక వ్యవసాయ బావి వద్దకు శనివారం ఉదయం అహీర్ అజ్మాన్‌తోపాటు అతడి స్నేహితులు మహ్మద్ అన్సర్, మహ్మద్ అర్మాన్ చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పడుతున్న సమయంలో అహీర్ అజ్మాన్ ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునుగుతుండగా స్నేహితులు కాపాడండి అంటూ కేకలు వేశారు. స్థానికులు వచ్చి కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే నీట మునిగాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది తాళ్లు, ఇతర పరికరాల సహాయంతో అహీర్ అజ్మాన్ మృతదేహాన్ని బయటకు తీశారు. అహీర్ అజ్మాన్ తండ్రి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి



అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముడి ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు.

స్వగ్రామానికి చేరిన శ్రీనివాస్ మృతదేహం

- తొమ్మిది రోజుల క్రితం దుబాయ్‌లో హత్య

- దమ్మన్నపేట గ్రామంలో విషాదం





స్వర్గం శ్రీనివాస్ మృతదేహం దగ్గర రోదిస్తున్న కుటుంబసభ్యులు, పాడె మోస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో కొద్దిరోజుల క్రితం పాకిస్తానీ చేతిలో హత్యకు గురైన స్వర్గం శ్రీనివాస్ (43) అనే వ్యక్తి మృతదేహం శనివారం ఆయన స్వగ్రామమైన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేటకు చేరుకుంది. దీంతో శ్రీనివాస్ భార్య జమున, కొడుకులు చందు, సూర్య, తల్లి రాజవ్వ బోరున విలపించారు. స్వర్గం శ్రీనివాస్ అనే వ్యక్తిని తొమ్మిది రోజుల క్రితం పాకిస్తానీ దారుణంగా నరికి చంపారు. దీంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్ కొన్నేళ్ల క్రితం దుబాయ్‌కి వెళ్లి అక్కడ ఓ బేకరిలో పని చేస్తుండేవాడు. పని ఒత్తిడి, మత విద్వేషం కూడా తోడు కావడంతో సహోద్యోగి అయిన పాకిస్తానీ దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్, నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేమ్ సాగర్ అనే ఇద్దరు వ్యక్తులను నరికి చంపాడు. అప్పటి నుంచి శ్రీనివాస్ భార్య, కొడుకులతో పాటు తల్లి స్వర్గం రాజవ్వ మృతదేహం రాకకోసం నిత్యం ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు శ్రీనివాస్ మృతదేహం శనివారం ఇంటికి చేరుకోగా కుటుంబసభ్యులు విలపించారు.

● అంత్యక్రియల్లో పాల్గొన్న విప్ లక్ష్మణ్‌కుమార్

స్వర్గం శ్రీనివాస్ మృతదేహానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం నివాళులర్పించారు. గోదావరి నది వద్ద మృతుడి అంత్యక్రియలు నిర్వహించగా అంతిమ యాత్రలో విప్ పాల్గొని పాడె మోసారు. మృతుడి అంత్యక్రియల కోసం రూ.10 వేలు అందించారు. కలెక్టర్ ప్రభుత్వం పక్షాన రూ.15 వేలు అంత్యక్రియల ఖర్చు కోసం అందించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటామని విప్ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుబాయ్‌లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు హత్యకు గురయ్యారని తెలిసిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మృతదేహాలను స్వదేశానికి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారన్నారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఎన్ఆర్ఐ పాలసీ కింద రూ.5 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ జాబ్, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుడి కుటుంబ సభ్యులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై సీసీఎస్ పోలీసుల దాడి

మేడిపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వకోట గ్రామశివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సీసీఎస్ పోలీసులు శనివారం దాడి చేశారు. పేకాట అడుతున్న ఏడుగురుని అదుపులోకి తీసుకొని వారి వద్దనుంచి రూ. 11,100, ఏడు మొబైల్ ఫోన్స్‌ను సీజ్ చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. పేకాటలో పట్టుబడ్డ వారిని మేడిపల్లి పోలీసులకు అప్పగించగా కేసు నమోదు చేశామని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. దాడుల్లో కానిస్టేబుల్ రమేష్, అఫ్రోజ్, కమలాకర్ పాల్గొన్నారు.

గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌లో..

గంగాధర(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిమ్మత్ నగర్‌లో పేకాట ఆడుతున్నవారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వంశీక్రిష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గ్రామ శివారులో పేకాడుతున్నారని పక్కా సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 9,600 రూపాయలు స్వాధీనం చేసుకొని నలుగురి పై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.

అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చిన వ్యక్తికి జరిమానా

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూరు గ్రామానికి చెందిన రంగు శ్రీనివాస్ అధిక వడ్డీలకు అప్పులు ఇస్తుండడంతో కలెక్టర్ జరిమానా విధించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారనే సమాచారం మేరకు గత నవంబరు నెలలో ఇంట్లో తనిఖీలు చేయగా ప్రామిసరీ నోట్లు, డాక్యుమెంట్లు లభించడంతో కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం శనివారం కలెక్టర్ 20 వేల రూపాయల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

మోటార్ల చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ఓదెల ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఇద్దరు వ్యవసాయ మోటర్ల చోరీ నిందితులను శనివారం అరెస్ట్ చేసినట్లు పొత్కపల్లి ఎస్సై రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీసీపీ పుల్ల కరుణాకర్ నిందితుల వివరాలను వెల్లడించారు. సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్, జూలపల్లి మండలాల్లో రైతులు బావులు, వాగులు, చెరువులపై సాగునీటి అవసరాలకు అమర్చుకున్న విద్యుత్‌మోటార్లు, సర్వీస్ వైర్లను చోరీకి పాల్పడగా కేసులు నమోదు చేశారు. ఓదెల మండలం శివారు జమ్మికుంటకు వెళ్లే రహదారిలో ఎస్సై దీకొండ రమేష్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా ట్రాలీ వాహనంలో ఓదెల తారకరామ కాలనీ, బుడిగజంగాల వాడకు చెందిన సిరిగిరి ప్రసాద్, అంగిడి సాయికుమార్ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని వాహనాన్ని తనిఖీ చేయగా విద్యుత్ మోటార్లు, సర్వీస్ వైర్లు కనిపించడంతో విచారణ చేపట్టారు. జల్సాలకు అలవాటు పడి వీరిద్దరు పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్, జూలపల్లి, సుల్తానాబాద్ పోలీస్ సర్కిల్ పరిధిలోనిలో చోరీలకు పాల్పడ్డారని, ట్రాలీలో తిరుగుతూ, జూలపల్లి మండలం కాచాపూర్‌లో ఆరు మోటార్లు, కోనరావుపేటలో ఒకటి, ఓదెల మండలం కొమిర ఎస్సారెస్పీ కాలువ వద్ద ఆరు మోటార్లు, కొలనూర్ శివారులో ఐదు మోటార్లు, పోత్కపల్లి శానగొండ శివారులో నాలుగు మోటార్లు, అలాగే 17 బావుల వద్ద నుంచి 170 మీటర్ల సర్వీస్ వైరు చోరీ చేశారు. రూపునారాయణపేట మానేరు వాగులోని 23 విద్యుత్ బోర్‌మోటార్లు, ఓదెల శివారులోని ఆరు మోటార్లను ఎత్తుకెళ్లారని తెలిపారు. సిరిగిరి ప్రసాద్ ఇనుప సామాను వ్యాపారం చేస్తూ ఆర్థిక నష్టాలకు గురయ్యాడు. దీంతో సునాయసంగా డబ్బులు సంపాదించేందుకు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులను పోగొట్టుకున్నాడని తెలిపారు. దీంతో ఇదే గ్రామానికి చెందిన అంగడి సాయికుమార్‌తో కలిసి ఇనుప సామాను దొంగిలించే వారని తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.10.67లక్షల విలువ చేసే విద్యుత్ మోటార్లు, 750 మీటర్ల సర్వీస్ వైరును, ఆటో ట్రాలీ, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ తెలిపారు. దొంగలను పట్టుకున్న ఏఎస్ఐ రత్నాకర్‌తో పాటు 13 మంది పోలీస్ సిబ్బందిని డీసీపీ అభినందించి రివార్డులను అందించారు. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై దీకొండ రమేష్ పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న డీసీపీ కరుణాకర్



చిత్రజ్యోతి

SINCE 1965



ఆ లోటును భర్తీ చేస్తుంది

- మోహనకృష్ణ ఇంద్రగంటి

'అష్టాచెమ్మ', 'గోల్కొండ హైస్కూల్', 'సమ్మోహనం' వంటి చిత్రాలతో సెన్సిబుల్ దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు మోహనకృష్ణ ఇంద్రగంటి. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'సారంగపాణి జాతకం'. ప్రియదర్శి, రూప కొడవాయూర్ ప్రధాన పాత్రల్లో నటించారు. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా మోహనకృష్ణ మీడియాతో ముచ్చటించారు. "ఒకప్పటితో పోల్చితో తెలుగులో పూర్తి స్థాయి కామెడీ చిత్రాల సంఖ్య తగ్గిపోయింది. ఆ లోటును భర్తీ చేస్తుందీ చిత్రం. కథానాయకుడి పాత్రకు ఎవరు సరిపోతారా అని వెతికే క్రమంలో, ప్రియదర్శి నటించిన 'బలగం'తో పాటు ఆయన చేసిన మరికొన్ని చిత్రాలు చూశా. ఈ కథకు ఆయనే సరిపోతారనిపించింది. ఇందులో పాత్రలన్నీ కొత్తగా ఉంటాయి. కేవలం థియేటర్లో చూసి ఆనందించడమే కాకుండా.. కొన్ని రోజుల పాటు మాట్లాడుకునేలా ఉంటుందీ సినిమా. అన్ని వర్గాలను మెప్పించే ఈ చిత్రం, కాసేపు మీ కష్టాలన్నింటినీ మర్చిపోయేలా చేస్తుంది. జాతకాలను అతిగా నమ్మే ఓ యువకుడి జీవితంలో జరిగిన ఆసక్తికరమైన సంఘటనలే చిత్రకథాంశం. నమ్మకం మూఢనమ్మకంగా మారి, ఇతరుల్ని ఇబ్బందిపెట్టకూడదనే సందేశాన్ని వినోదాత్మకంగా అందిస్తుంది. సినిమాలో కడుపుబ్బా నవ్వుకునే వినోదంతో పాటు ఓ క్రైమ్ ఎలిమెంట్ ఉంటుంది. అది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడిగా ఈ సినిమా నాకు చాలా సంతృప్తిని ఇచ్చింది. ఇప్పుడు ప్రేక్షకుల అటెన్షన్ స్పాన్ తగ్గిపోయింది. వారు థియేటర్లో మొబైల్ తీయకుండా ఉంచగల స్థాయిలో సినిమాలు తీయడం దర్శకులు నేర్చుకోవాలి" అని చెప్పారు.




ఎన్ని అబద్ధాలు చెప్పినా మా సినిమా గెలుస్తుంది

విజయశాంతి

"అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు పాదాభివందనాలు. క్లైమాక్స్ కోసం కల్యాణ్‌బాబు తీసుకున్న రిస్క్ వల్లే సినిమా ఇంత గొప్పగా వచ్చింది. సినిమాకు నెగెటివ్ ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదు. దుష్ప్రచారం చేసేవారు దయచేసి మైండ్‌సెట్‌ను మార్చుకోండి. వారు సినిమా బాగాలేదని ఎన్ని అబద్ధాలు చెప్పినా, చివరికి మా సినిమానే గెలుస్తుంది. కోట్లు ఖర్చు పెట్టి తీసిన సినిమాను బ్రతకనివ్వండి. మనస్ఫూర్తిగా సినిమాను దీవించడం నేర్చుకోండి" అని నటి విజయశాంతి అన్నారు. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవలె విడుదలైంది. సక్సెస్ మీట్‌లో కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ "కమర్షియల్ సినిమాలోనూ కొత్తదనం ఉంటేనే ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. ఈ విషయంలో దర్శకుడు ప్రదీప్ ప్రేక్షకుల అంచనాలను అందుకున్నాడు" అని చెప్పారు.













రోడ్లపై వారసంతలు.. రాకపోకలకు ఇబ్బందులు

- తరచుగా ప్రమాదాలు - పెరుగుతున్న దొంగతనాలు - భయాందోళనలో ప్రజలు - అధికారులు స్పందించాలని వేడుకోలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, నారాయణపూర్ తదితర గ్రామాల్లో వార సంతలు ప్రధాన రహదారులపై కొనసాగుతున్నాయి. ఆ రహదారుల గుండా వెళ్లడానికి ప్రజలకు ఇబ్బందికరంగా మారుతున్నాయి. కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారికి అనుకుని సంతలు నిర్వహిస్తుండడంతో అటు ప్రజలు.. ఇటు వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాల్లో రోజుకోసారి వార సంతలను బస్టాండు ప్రాంతాలకు సమీపంలోని ప్రధాన రహదారులపై నిర్వహిస్తున్నారు. సుమారు 300లకు పైగా దుకాణదారులు కూరగాయలు, చేపలు, వివిధ రకాల వస్తువులు విక్రయిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో కొనసాగుతున్న వార సంతలకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వందల మంది ప్రజలు వస్తుంటారు. రోడ్డుపైనే సంతలు కొనసాగుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కిక్కిరిసే జనంలో సంతల లోపలికి వెళ్లేందుకు, తిరిగి వచ్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయి. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.



ఎల్లారెడ్డిపేటలోని వార సంత

అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రహదారులపై ట్రా'ఫికర్'

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, వెంకటాపూర్, హరిదాస్‌నగర్, తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న వార సంతల వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. కామారెడ్డి- సిరిసిల్ల ప్రధార రహదారి పక్కన కొనసాగుతుండడం వల్ల ట్రాఫిక్ నిలిచిపోతోంది. కాలు వేయలేని స్థితిలో దుకాణాలు ఏర్పాటు చేయడంతో రాకపోకలు సాగించే వాహనదారులు చిక్కుకుపోతున్నారు. రద్దీగా ఉండే బస్టాండు ప్రాంతాల్లో సంతలు జరుగుతుండడం వల్ల గతంలో ప్రమాదాలు జరిగిన ఘటనలున్నాయి. దారి పొడవునా ద్విచక్రవాహనాలను నిలపడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది.

రెచ్చిపోతున్న దొంగలు..

ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న వార సంతల్లో దొంగలు చేతులకు పని చెబుతున్నారు. రద్దీగా ఉండడం వల్ల దొంగలు అదే అదునుగా భావిస్తూ మహిళల చేతి సంచులు, సెల్‌ఫోన్లను దొంగిలిస్తున్నారు. ప్రతి గ్రామంలో జరిగే వారసంతలో చోరీల ఘటనలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఓ వైపు ఇబ్బందులు.. మరో వైపు చోరీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి వార సంతల్లో నిఘాను తీవ్రతరం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై సంతతో నడవలేకపోతున్నాం

- సాయిబాబా, యువకుడు, రాచర్లబొప్పాపూర్



మా ఊరిలో ప్రతి బుధవారం వార సంతను రోడ్డుపై నిర్వహిస్తున్నారు. కూరగాయలు, ఇతర వస్తువులు అమ్ముకునేందుకు వ్యాపారులు, రైతులు రావడంతో రోడ్డంతా నిండిపోతోంది. సంత నుంచి నడవలేకపోతున్నాం. అధికారులు వార సంతను ఖాళీ స్థలంలో ఏర్పాటు చేస్తే సౌకర్యవంతంగా ఉంటుంది.

వార సంతలకు స్థలాలు కేటాయించేలా చర్యలు

- సత్తయ్య, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట



మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న వార సంతలకు స్థలాలు కేటాయించేలా చర్యలు చేపట్టాం. వార సంతల వల్ల ప్రజలు, వ్యాపారులు, వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. స్థలాలను కేటాయించి సంతలను నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం.

ట్రాఫిక్ సమస్యను నియంత్రిస్తాం

- రమాకాంత్, ఎస్ఐ, ఎల్లారెడ్డిపేట



గ్రామాల్లో వారసంతల వల్ల తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు సూచించాం. వారసంత జరిగే సమయంలో స్టాపర్లను ఏర్పాటు చేస్తున్నాం. సంతలో దొంగతనాలు జరుగకుండా ప్రత్యేక పోలీసులను గస్తీ కాసేలా చర్యలు తీసుకున్నాం.

పాఠశాలకు సామగ్రి వితరణ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపాక గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎన్ఆర్ఐ రొండ్ల అమరేందర్ సామగ్రిని వితరణ చేశారు. రూ 10 వేల విలువైన బీరువా, గోడ గడియారాలు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌గౌడ్, ప్రధానోపాధ్యాయురాలు రేవతిదేవిలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్..

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంగమరెడ్డిపల్లె గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఏక్‌భారత్, శ్రేష్ఠభారత్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు గోన సత్యం, ఉపాధ్యాయులు అశోక్, రమ్య, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ జమున తదితరులు పాల్గొన్నారు.

ఐఏపీ జిల్లా కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్(ఐఏపీ)రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ నూతన కార్యవర్గంను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు డాక్టర్ నల్ల మధు, ప్రధానకార్యదర్శి డాక్టర్ తడక సాయికుమార్ ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలను స్వీకరించారు. వైద్యులు ప్రసాద్‌రావు, మురళీధర్‌రావు, శ్రీనివాస్, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ కమిటీ సభ్యులకు సన్మానం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని విశ్వనాథ దేవాలయం నూతన కమిటీ సభ్యులు శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. కమిటీ చైర్మన్ చేపూరి జనార్దన్, డైరెక్టర్లు ఇరుకుల్ల నాగరాణిప్రవీన్, కోడం శ్రీదేవి, సిరిగిరి నవత, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్‌ను కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సన్మానించారు. కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు రాగుల జగన్, కుడికాల రవికుమార్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

కోనరావుపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామానికి చెందిన చిద్రవేణి అంజయ్య మరణించగా పేదరికంలో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు 50కిలోల బియ్యాన్ని అందజేశారు. పేదరికంలో ఉన్న ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయని ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో చిద్రవేణి ప్రభాకర్, ఆనంద రెడ్డి, రాజిరెడ్డి, మల్లేశం, కిషన్, రాములు తదితరులు ఉన్నారు.

కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

చందుర్తి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. వరంగల్‌లో ఈనెల 27 ఎల్కతుర్తి ఎక్స్‌రోడ్ వద్ద జరిగే కేసీఆర్ భారీ బహిరంగ సభ పోస్టర్‌ను చందుర్తిలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27 జరిగే బహిరంగ సభకు కార్యకర్తలందరూ రావాలన్నారు. సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య, నాయకులు మరాఠి మల్లిక్, చిలుక పెంటయ్య, రమేష్, అంజయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో ప్రముఖులు



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న ఎస్పీ మహేష్ బీ గీతె

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామిని పలువురు ప్రముఖులు శనివారం దర్శించుకున్నారు.కరీంనగర్ జిల్లా ఫస్ట్ అడిషనల్ డిస్టిక్ జడ్జిగా విధులు నిర్వర్తించి రాజన్న సిరిసిల్లకు బదిలీపై వచ్చిన సందర్భంగా జడ్జి డి. వెంకటేష్, జిల్లా జడ్జిగా విధులు నిర్వర్తించి బదిలీపై గద్వాల్‌కు వెళుతున్న సందర్భంగా జడ్జి ఎస్. ప్రేమలత స్వామివారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. అలాగే ఎస్పీ మహేష్ బి. గీతె స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొని కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనంతరం అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఈవో వినోద్‌రెడ్డి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాన్ని అందజేశారు.

నియామకం

గంభీరావుపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్రఅధ్యక్షుడిగా గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌కు చెందిన కొక్కు దేవేందర్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో జరిగిన ప్లీనరీలో కొక్కు దేవేందర్‌యాదవ్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు.

సర్వే పారితోషికం అందించాలి

తంగళ్లపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కుల గణన నిర్వహించిన ఉపాధ్యాయులకు హాజరుపత్రాలు, పారితోషికం అందించాలని తంగళ్లపల్లి మండలంలోని ఉపాధ్యాయులు ఎంపీడీవో లక్ష్మీనారాయణకు శనివారం వినతిపత్రం సమర్పించారు. తంగళ్లపల్లి మండలంలో ఉపాధ్యాయులు గత సంవత్సరం కులగనన సర్వే పారితోషికం, హాజరుపత్రాలు ఇప్పటివరకు ఇవ్వలేదని, తక్షణమే అందించాలని ఉపాధ్యాయులు సమర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన కులగణన, సామాజిక, ఇంటింటి సర్వే చేపట్టిన ఎన్యూమరేటర్లకు గౌరవ వేతనం అందించాలని కోరారు.

'భూభారతి'తో భూసమస్యలు పరిష్కారం

- అవగాహన సమావేశంలో కలెక్టర్, ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ప్రభుత్వం తీసుకవచ్చిన భూభారతితో రైతుల భూసమస్యలు పరిష్కారం అవుతాయని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో శనివారం భూభారతి చట్టంపై అవగాహన సమావేశం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతు ధరణి వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకవచ్చిందన్నారు. భూసమస్యలతో బాధపడేవారంతా చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు ఉచిత న్యాయసహాయం అందించడంతో పాటు వచ్చేనెలలో గ్రామగ్రామాన సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతు హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉందని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందే భూముల సర్వే ఉంటుందన్నారు. పెండింగ్ సాదాబైనామాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. మ్యాప్ జియోట్యాగింగ్‌తో పాస్‌బుక్కులు జారీచేయడం జరుగుతుందన్నారు. ఈసందర్భంగా రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రాధాబాయి, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళలతో పాటు వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలి

- జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం



పౌష్టికాహారాన్ని అందిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారంపై అవగాహన పెంచుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోని పోషకాహారం తీసుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం తెలిపారు. పోషణ పక్షంలో భాగంగా శనివారం సిరిసిల్లలోని ఐసీడీఎస్ అంబేద్కర్ సెక్టార్ పరిధిలో అంబేద్కర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ జాతర అన్నప్రాసన, సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పౌష్టికాహారాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఉమారాణి సూపర్‌వైజర్ దివ్య, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని రాజన్న సిరిసిల్లా జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు. మండలంలోని గూడెంలోగల అంగన్‌వాడీ సెక్టార్ పరిధి లోని గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన పక్వాడ కార్యక్రమానికి డీడబ్లువో లక్ష్మీరాజం పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంది స్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణీ బాలింతలకు, తల్లులకు, పిల్లలకు అంగనివాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఉమారాణి, సూపర్‌వైజర్ అంజ లి, డి హబ్ దేవిక, అంగనివాడీ టీచర్లు, ఆయాలు తది తరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధు లు దరిచేరవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చంద్రకళ పేర్కొంది. మం డలంలోని గొల్లపల్లె గ్రామంలో శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు చల్ల వాణి, మీసాల సుగుణ, కడగండ్ల శిరీష, ఏఎన్ఎమ్ దేవకి, స్వరూప, సంధ్య, సొల్లు శాంత తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారుల సర్టిఫికెట్ల పరిశీలన

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల మున్సిపల్‌లోని విలీన గ్రామాల్లో రాజీవ్ యువ వికాసం కోసం ధరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్‌లను శనివారం మున్సిపల్, బ్యాంక్ అధికారులు పరిశీలించారు. సర్ధాపూర్, పెద్దూర్, చిన్న బోనాల, రాజీవ్‌నగర్ గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సర్టిఫికేట్ పరిశీలన కార్యక్రమానికి ఆయాగ్రామాల్లో దరఖాస్తులు చేసుకున్న వారందరు తమ సర్టిఫికెట్‌లను బ్యాంక్ అధికారులు పరిశీంచారు. మాజీ కౌన్సిలర్‌లు లింగంపల్లి సత్యనారాయణ,చెన్నమనేని కీర్తికమలాకర్‌రావు, బొల్గం నాగరాజుగౌడ్ లతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగ కిరణ్, గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎంపీడీఓ శశికళ పేర్కొన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో శనివారం రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. తొలిరోజు గాలిపెల్లి, వంతడుపుల, తాళ్ళపెల్లి , పత్తికుంటపల్లె, ముస్కానిపేట, రేపాక, తాళ్ళల్లపల్లె, సోమారంపేట, వెంకట్రావుపల్లె, గొల్లపల్లె, కేసన్నపల్లె, ఆరెపల్లి గ్రామాలకు చెందిన వారి ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో సూపరింటెంట్ శ్రీనివాస్, బ్యాంక్‌మేనేజర్ గోరవ్దన్, సూర్య, వినయ్‌లతో పాటు పంచాయితీ కార్యదర్శులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.



సిరిసిల్ల సర్ధాపూర్‌లో సర్టిఫికెట్‌లను పరిశీలిస్తున్న అధికారులు

రైతులు మనోధైర్యాన్ని కోల్పోవద్దు

- ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి

ముస్తాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : అకాలంగా కురిసిన వర్షంతో నష్టపోయిన రైతులు మనోధైర్యాన్ని కోల్పోవద్దని ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మద్దికుంట గ్రామంలో దెబ్బతిన్న వరిపంటలు, మామడిపంటలను పరిశీలించారు. ఈసందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ మామిడితోట ఎకరానికి లక్ష రుపాయలను, వరి పంట ఎకరానికిరూ రూ 30వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒక్కసారిగా ఈదరుగాలుతో కూడిన వర్షం రావడంతో పెద్దఎత్తున నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని తక్షణ సాయం అందించి రైతులకు ధైర్యాన్ని కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్, జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బాధ నరేశ్, సొల్ల క్రాంతి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు వరి వెంకటేశ్, కోల కృష్ణ, మెంగని మహేందర్, మల్లేశం, కుడుకల జనార్ధన్ యాదవ్, కళ్యాణ్‌యాదవ్, చిగురు వెంకన్న, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



విరిగిపడిన మామిడిచెట్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

పంట నష్టపరిహారం అందేలా కృషి

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) :అకాల వర్షాలు, వడగళ్ల వానకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందేలా చూస్తానని సిరిసిల్లా నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు, మద్దికుంట గ్రామాల్లో దెబ్బతిన్న వరిపంటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈదురుగాలులతో కూడిన అకాల వర్షానికి వరిపంట, మామిడితోటలు దెబ్బతినడంతో అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో అంచనా వేశారు. కలెక్టర్‌తో, నష్టపోయిన రైతుతో ఫోన్ ద్వారా పంటనష్టాన్ని వివరించేలా కేకే మహేందర్‌రెడ్డి చేశారు. రైతులు అధైర్యపడొద్దని పంట వర్షాలతో నష్టం జరగడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణినర్సింలు, ఏఎంసీ మాజీ చైర్మన్ అంజనేయరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, కొండం రాజిరెడ్డి, సత్యనారాయణగౌడ్, దీటి నర్సింలు, దుబ్బాక రాజు, ఉచ్చిడి బాల్‌రెడ్డి, సద్ది మధు, ఆంజనేయులు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

వేతన వెతలు..

(1వ పేజీ తరువాయి)

ఆగస్టు వరకు 13,37,300 పనిదినాలు, సెప్టెంబరు వరకు 14,43,862 పనిదినాలు, అక్టోబరు వరకు 15,58,084 పనిదినాలు, నవంబరు వరకు 16,92,632 పనిదినాలు, డిసెంబరు వరకు 18,42,542 పనిదినాలు, 2026 సంవత్సరంలో జనవరి వరకు 20,25,122 పనిదినాలు, ఫిబ్రవరి వరకు 23,08,391 పనిదినాలు, మార్చి వరకు పూర్తిగా 26,75,383 పనిదినాలు పూర్తిచేసే దిశగా సిబ్బంది పనిచేస్తున్నారు.

వేతనాలు అందక ఇబ్బంది పడుతున్నాం..

- మంద రాజు, ఫీల్డ్‌అసిస్టెంట్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు



ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న మాకు మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం. ఫీల్డ్‌అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారందరు ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు చెందిన వారే ఉన్నారు. ఇంటిలోకి నిత్యావసర వస్తువులు కూడా తేలేని పరిస్థితి ఏర్పడింది. వేతనాలు వెంటనే విడుదల చేయాలని, చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న తమకు ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లు ఉద్యోగ భద్రత కల్పించాలి.

సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలి

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సమాజిక అంశాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ అన్నారు. శనివారం రాత్రి సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్ మోసాలు, సైబర్ మోసాలు, బెట్టింగ్ యాప్స్, మహిళా చట్టాలు, షీటీం, గంజాయి, దొంగత నాలు, నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌లో గంజాయి సేవిస్తున్న శ్రీనగర్ కాలనీకి చెందిన సారంగుల ప్రేమ్‌దాస్(22), శాంతినగర్‌కు చెందిన గూడూరి సాయికిరణ్(22), పద్మనగర్‌కు చెందిన అలువాల ప్రశాంత్(25)అనే యువకులను శనివారం రాత్రి అరెస్ట్‌చేశామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. వీరి వద్ద 60గ్రాముల గంజాయి, మూడు మొబైల్స్, ఒక ద్విచక్ర వాహనం, మూడు గంజాయి సిగరేట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

రేపు ప్రజావాణి కార్యక్రమం రద్దు : కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావద్దని విజ్ఞప్తి చేశారు. ఈనెల 21 సోమవారం హైకోర్టు కేసు విషయంలో వ్యక్తిగతంగా హాజరుకావల్సి ఉన్నందున ప్రజావాణి కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ కోరారు.

ఫాజుల్ నగర్‌లో వైద్య శిబిరం

వేములవాడ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఆధ్వర్యంలో ఫాజుల్‌నగర్ గ్రామంలో శనివారం కిడ్నీ మెడికల్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ క్యాంపును వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు కిడ్నీవ్యాధులు రాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్యూరిఫైడ్ నీరు, గోరు వెచ్చని నీరు తాగాలన్నారు. క్యాంపులో 105 మందిని పరీక్షించగా అనుమానిత 10 మందిని గుర్తించి వారి రక్త నమూనాలను సేకరించి తెలంగాణా డయాగ్నొస్టిక్‌కి పంపించినట్లు వైద్యా ధికారులు తెలిపారు. వైద్యులు లహరి, విశ్వేశ్వర్, మధు, ప్రపంచ, ప్రసన్న, హెచ్‌యు బాలయ్య, గంగంరాజు, రాజయ్య, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసనాలతో సాధారణ ప్రసవాలు..

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు ఆసనాలు చేయడం వల్ల సాధారణ ప్రసవాలు జరిగేందుకు సులభతరం అవుతుందని ఆయుష్ సిబ్బంది పేర్కొన్నారు. రాచర్ల బొప్పాపూర్‌లోని అంగన్‌వాడి కేంద్రంలో గర్భిణులకు శనివారం యోగాపై అవగాహన కల్పించారు. గర్భిణులు నిత్యం వైద్యుల సూచనల మేరకు యోగా చేయడం వల్ల ఆరోగ్యం, కడుపులో ఉన్న బిడ్డ సురక్షితంగా ఉంటుందన్నారు. పౌష్టికాహారం తీసుకుని జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది, అంగన్వాడి టీచర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

బీసీలకు న్యాయం చేసినందుకే ప్రభుత్వానికి మద్దతు

గంభీరావుపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు ఏ పార్టీలు చేయని న్యాయం కాంగ్రెస్ ప్రభుత్వం చేసినందుకే రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు వెల్లడించారు. గంభీరావుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్‌తో కలిసి ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలైన వెంకటస్వామి, లింగమ్‌యాదవ్, వెంకటిలు మాట్లాడిన తీరును ఖండించారు. బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ కల్పించి తగిన న్యాయం చేసిందని, ఇందుకు ప్రభుత్వానికి రుణపడి ఉండాల్సిందేనన్నారు. నెల రోజుల వ్యవధిలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడి పోస్టుకు రాజీనామా చేసి, కాంగ్రెస్ కండువా కప్పుకుంటానన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు రాజుగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి గౌరిశంకర్ తదితరులు ఉన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న శ్యాంప్రసాద్ లాల్

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు బాధ్యతాయుతంగా పని చేసి కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ సొసైటీ సంయుక్త కార్యదర్శి శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ డిగ్రీ(బాలురు) కళాశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. కళాశాల ఆవరణ, వంటగది, సరుకుల నిల్వ గది, తరగతి గదులు, రికార్డులు విద్యార్థుల సంఖ్య, అధ్యాపకుల హాజరుపట్టికను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కళాశాలలో ఎంతమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని ప్రిన్సిపాల్ వీర ప్రభాకర్‌ను ప్రశ్నించారు. విద్యార్థులు తక్కువగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్య పెంచాలని, బాధ్యతతో విధులు నిర్వహించాలని ఆగ్రహించారు. విధుల్లో అలసత్వం వహిస్తే వేటు తప్పదని శ్యాంప్రసాద్‌లాల్ హెచ్చరించారు. ప్రిన్సిపాల్ వీర ప్రభాకర్, అధ్యాపకులు ఉన్నారు.